క్లుప్తంగా

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



పోలకల్ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: సచివాలయ ఉద్యోగులు సమయపాలనను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. మండలంలోని పోలకల్ గ్రామంలో బుధవారం ఎంపీడీఓ పర్యటించారు. ముందుగా ఒకటి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఉద్యోగులు 10:30 గంటల అనంతరం విధులకు రావడంపై ఎంపీడీఓ అసహనం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించాలని ఆయన హెచ్చరించారు. అదే విధంగా రెండవ గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఎంపీడీఓ రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ ఉద్యోగులకు సూచించారు.

'ఉపాధి' పనులు మొదలు పెట్టండి



మాట్లాడుతున్న పీడీ శివనాగప్రసాద్

ఓర్వకల్లు: ఉపాధి పనులను మొదలు పెట్టాలని ప్రాజెక్టు ఆఫీసర్, ఎంపీడీఓ శివనాగప్రసాద్ సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులకు సమావేశం నిర్వహించారు. ఏపీఓ కుమార్‌సాయినాథ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు ఎకరాలలోపు రైతుల పొలాల్లో ఉపాధి కూలీలతో పారం పాండ్స్, పంట కాల్వలు తవ్వించాలని పేర్కొన్నారు. అదేవిధంగా కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. పండ్ల తోటల పెంపకం కింద గుర్తించిన పొలా ల్లో పండ్ల మొక్కలు నాటించాలని తెలిపారు.

సి.బెళగల్‌లో ఇసుక బుకింగ్ ప్రారంభం



సి.బెళగల్ సచివాలయంలో ఇసుక బుకింగ్ జరుగుతున్న దృశ్యం

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ గ్రామ సచివాలయం – 2లో బుధవారం ఇసుక బుకింగ్ కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఏఎస్ఓ ఆదినారాయణ ఆధ్వర్యంలో వీఆర్వోలు, మైనింగ్ సిబ్బంది బుక్కింగ్ ప్రారంభించగా మండలంతో పాటు ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు, కోడుమూరు, గోనేగండ్ల తదితర మండలాలకు చెందిన వ్యక్తులు ఇసుక బుకింగ్ చేసుకున్నారు. టన్ను ఇసుక రూ.326.50 చొప్పున ఉండగా, మొదటి రోజు 56 టిప్పర్లు, 32 ట్రాక్టర్ల ఇసుకను బుకింగ్ జరిగిందని వీఆర్వోలు సాయిరమణ, లింగేష్ తెలిపారు.

గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి

కల్లూరు: గ్రామాల అభివృద్ధికి ప్రతి మండల స్థాయి అధికారి ప్రణాళికలు సిద్ధం చేయాలని మండల ప్రత్యేక అధికారి రమణ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో బుధవారం వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం వికసిత్ ఆంధ్ర -2047 లక్ష్యంగా రాబోయే ఐదేళ్లకు సంబంధించి ప్రతి శాఖ నుంచి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలు, ఉపాధి పనులు, పండ్ల తోటలు, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ, ఆరోగ్యం తదితర శాఖల ప్రణాళికలు సకాలంలో అందించాలన్నారు.

మహిళా సంఘాల నిరసన

కర్నూలు(సెంట్రల్): ప్రేమ, పెళ్లిళ్ల పేరుతో యువతులను మోసం చేస్తున్న సీహెచ్ విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ మహిళా సమాఖ్య, ఎస్ఎఫ్ఐ డబ్ల్యూ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, బీసన్న, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యులకు భద్రత కల్పించాలి



కోలకతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యారం అమానుషం. రోగులకు నిత్యం వైద్య సేవలు అందజేస్తున్న డాక్టర్లకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కోల్‌కతా సంఘటనలు పునరావృత్తం కాకుండా దుండగులను కఠినంగా శిక్షించాలి. అదేవిధంగా ఆసుపత్రులలో వైద్యులకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. ఆసుపత్రులలో పోలీస్ భద్రతతో పాటు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ మాధుస్ రెడ్డి, సి.బెళగల్ పీహెచ్‌సీ



వైద్యులకు భరోసా కల్పించాలి



డాక్టర్లకు, వైద్య సిబ్బందికి ఆస్పత్రులలో ఎటువంటి రక్షణ లేదు. రోగులకు వైద్య సేవలు అందజేసే వైద్యులు, సిబ్బందికి రక్షణ భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన పునరావృత్తం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలి. అక్కడక్కడ వైద్యులు, సిబ్బందిపై భౌతిక దాడులు సైతం జరుగుతూనే ఉన్నాయి. వీటిని అరికట్టాలంటే పోలీసు ప్రొటెక్షన్ కల్పించాలి.

–డాక్టర్ మోతీలాల్ నాయక్, కల్లూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, కల్లూరు.

సమస్యల నిలయాలు... సంక్షేమ హాస్టళ్లు!

- అరకొర వసతులు.. గదుల కొరత
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినీ, విద్యార్థులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ఓర్వకల్లు: సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయి. అరకొర వసతులతో విద్యార్థినీ, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కనీస మౌలిక వసతులు కరువై విద్యార్థులు సతమతమవుతున్నారు. ఏళ్లకిందట నిర్మించిన హాస్టల్ భవనాలలో విద్యార్థులు మగ్గుతున్నారు. కొన్ని చోట్ల అరకొర గదుల మధ్య కాలం వెళ్లదీస్తుండగా, మరి కొన్ని చోట్ల ప్రహరీ లేక భద్రత సదుపాయాలు దెబ్బతింటున్నాయి. మరోచోట ఏకంగా హాస్టల్ గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో విద్యార్థులు భయంగుప్పెట్లో కాలం వెల్లదీస్తున్నారు. ఓర్వకల్లు మండలంలోని నాలుగు వసతి గృహాల పరిస్థితి దారుణంగా ఉంది. మండల కేంద్రం ఓర్వకల్లులో ఎస్సీ బాల, బాలికలకు వేర్వేరు వసతి గృహాలు, లొద్దిపల్లె, మీదివేములలో వేర్వేరు బీసీ వసతి గృహాలు సమస్యలకు కేంద్రాలుగా మారాయి. దీంతో విద్యార్థులు పడరానిపాట్లు పడుతూనే ఉన్నారు.

బాలికలకు తప్పని ఇబ్బందులు

మండల కేంద్రం ఓర్వకల్లులో ఎస్సీ బాలికల కోసం మొదట 2007లో హాస్టల్ ఏర్పాటు చేశారు. కొంత కాలం హాస్టల్‌ను అద్దెభవనంలో నడిపారు. 2010లో అప్పటి కలెక్టర్ దానకిశోర్ బాలికల వసతి గృహానికి ప్రత్యేక భవనం మంజూరు చేశారు. ఈ వసతి గృహం ఆరంభంలో 150 మందిలోపే విద్యార్థినులు వసతి పొందేవారు. విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ఈ గృహంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థినులు దాదాపు 310 మంది వసతి పొందుతున్నారు. విద్యార్థినుల సంఖ్యకు సరిపడే గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది క్రితం హాస్టల్ వార్డెన్ చొరవ తీసుకుని విరాళాలు సేకరించి భవనం పైభాగంలో రేకుల షెడ్‌ను నిర్మించారు. ఈ షెడ్‌లో సుమారు 100 మంది విద్యార్థినులు తలదాచుకుంటున్నారు.



ఓర్వకల్లులో ప్రహరీలేని ఎస్సీ బాలుర వసతి గృహం

చలికాలం, వర్షాకాలంలో విద్యార్థినుల పరిస్థితి దయనీయంగా ఉంటుంది.

బాలుర హాస్టల్ పరిస్థితీ అంతే...

మండల కేంద్రం ఓర్వకల్లులోని బాలుర హాస్టల్ పరిస్థితి అంతే అన్నట్లుగా ఉంది. కనీస వసతులు కరువై విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 45 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ హాస్టల్ అద్దెభవనంలో నడిపారు. 2017లో నూతనంగా భవనం నిర్మించారు. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు రాత్రివేళల్లో భయపడుతూ గడపుతున్నారు. మరుగుదొడ్లు నీటివసతిలేక నిరుపయోగంగా వదిలేశారు.చాలా గదులల్లో ఫ్యాన్లు పనిచేయడం లేదు. దోమల బెడదతో విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు.

శిథిలావస్థకు చేరిన లొద్దిపల్లె హాస్టల్

మండలంలోని లొద్దిపల్లె గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకుంది. 1988లో ఏర్పాటు చేసిన ఈ వసతి గృహం గదుల తలుపులు కిటికీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇక్కడ 110 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. భవనం పాత పడడంతో విద్యార్థులకు తీవ్ర అసౌకర్యంగా నెలకొంది. కొన్ని గదులల్లో పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. కడ్డీలు, కాంక్రీట్ బయటకు తేలడంతో పిల్లలు భయం గుప్పెట్లో కాలం వెల్లదీస్తున్నారు.

మీదివేముల హాస్టల్‌లో గదుల కొరత

మీదివేములలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య అవసరమైన గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందులో సుమారు 300 మందికిపైగానే విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఒక్కో గదిలో 25–30 మంది ఉంటున్నారు. హాస్టల్‌కు ప్రహరీ లేకపోవడంతో అప్పుడప్పుడు విషసర్పాలు దర్శనమిస్తున్నట్లు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బాలికల హాస్టల్‌పై నిర్మించిన రేకుల షెడ్



లొద్దిపల్లె హాస్టల్‌లో పెచ్చులూడుతున్న దృశ్యం



బండపరుపులేని ఓర్వకల్లు బాలికల హాస్టల్

దోమల బెడదను భరించలేకపోతున్నాం



హాస్టల్ గదుల్లో అమర్చిన ఫ్యాన్లు సరిగా పనిచేయడం లేదు. పగటి పూట ఉక్కపోత, రాత్రి పూట దోమల బెడదకు తట్టుకోలేక పోతున్నాం. ఒక్కో గదిలో నాలుగు ఫ్యాన్లు అమర్చగా గదికి ఒక్కటి మాత్రమే పనిచేస్తున్నాయి. రాత్రి దోమలతో జాగారం చేయాల్సి వస్తుంది. ఫ్యాన్‌లతోపాటు కిటికీలకు జాలర్లు ఏర్పాటు చేయించాలి.

– సునీల్, 10వ తరగతి విద్యార్థి, ఓర్వకల్లు

వంటగదిలో వర్షపునీరు పడుతుంది



వంట గదిపై నిర్మించిన రేకుల షెడ్ రంధ్రాలు ఏర్పడి వర్షం కురిసినప్పుడు పైనుంచి నీటిచుక్కలు ఆహారపదార్థాలపై పడుతున్నాయి. వంట తయారీకి చాలా ఇబ్బందిగా ఉంటుంది. హాస్టల్ భవనం పాతపడి గదుల్లో వర్షపునీరు లీకేజీ అవుతుంది. కొత్త భవనాన్ని మంజూరు చేయాలి.

– సి.విజయ్ 10వ తరగతి విద్యార్థి, లొద్దిపల్లె

అదనపు గదులు నిర్మించాలి



మా హాస్టల్‌లో సుమారు 300 మంది విద్యార్థినులం ఆశ్రమం పొందుతున్నాం. అయితే రెండు హాల్లు, రెండు గదులు మాత్రమే ఉన్నాయి. దీంతో చాలా ఇరుకాటంలో పడుకోవాల్సి ఉంటుంది. మా ఇబ్బందులు చూడలేక వార్డెన్ మేడం విరాళాలు సేకరించి భవనంపైన రేకుల షెడ్ నిర్మించారు. దీంతో తాత్కాలిక సమస్య పరిష్కారమైంది. మాకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– ప్రవల్లిక, హాస్టల్ విద్యార్థిని, ఓర్వకల్లు

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

గడివేముల: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆయన బుధవారం మండల కేంద్రమైన గడివేములలోని మోడల్ స్కూల్, కస్తూర్బాలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నాణ్యమైన కూరగాయలు వాడాలని, వంట ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గురునాథ్ తదితరులు పాల్గొన్నారు,

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో బుధవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

మెరుగైన సేవలే లక్ష్యం



పెంచికలపాడు బీఓబీ శాఖ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఖాతాదారులకు మరింత సౌలభ్యంగా ఉండాలనే లక్ష్యంతో గూడూరు మండలంలోని పెంచికలపాడు బ్రాంచిని నూతన భవనంలోకి మార్పు చేసినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా హైదరాబాద్ జోన్ డీజీఎం ఎంపీఎస్ సుధాకర్ తెలిపారు. బుధవారం పెంచికలపాడు బ్రాంచ్ నూతన భవనాన్ని విశ్వభారతి మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్ చైర్మన్ కాంతారెడ్డి, కర్నూలు డీఎస్పీ జే.బాబుప్రసాద్, బ్యాంక్ ఆఫ్ బరోడా తిరుపతి రీజినల్ హెడ్ పి.అమరనాథరెడ్డితో కలసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే బ్యాంక్ ఆఫ్ బరోడా రెండవ అతి పెద్ద బ్యాంక్‌గా సేవలందిస్తోందని చెప్పారు. పెంచికలపాడు శాఖ ద్వారా 20 గ్రామాలకు చెందిన రైతులు, అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నట్లు వివరించారు. దాదాపు 60 వేల మంది ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. స్థానిక బ్రాంచ్ మేనేజర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

పాణ్యం: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హెచ్‌డీఎస్ చెర్మన్, ఎంపీపీ ఉసేన్‌బీ సూచించారు. బుధవారం మద్దూరు పీహెచ్‌సీలో ఎస్‌డీఎస్ (హాస్పటల్ డెవలప్‌మెంట్ సొసైటీ)కమిటీ సమావేశం చెర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల శాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. 108,104 వాహనాల సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. గత ప్రభుత్వం వైద్య శాఖను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసిందని, అందే రీతిలో ముందుక తీసుకెళ్లాలన్నారు. ఆసుపత్రికలో పరికరాలు, స్టేషనరీ, ఇతర అత్యవసర సేవల పరికరాలు కొనుగోలుకు సంబంధించి అజెండా తయారు చేశారు. అనంతరం ఆసుపత్రిలో ముందుల, ఓపీల వివరాలు, వైద్య సేవలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునీతా, మద్దూరు సర్పంచ్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, అనుపూరు సర్పంచ్ నాగలక్ష్మీమ్మ తదితరుల పాల్గొన్నారు.



మందుల నిల్వలపై ఆరా తీస్తున్న ఎంపీపీ ఉసేన్‌బీ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి కర్నూలు వెళ్లేరోడ్డులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కోడుమూరుకు చెందిన జగదీష్(31) బైక్‌పై కర్నూలుకు బయలుదేరగా, ప్యాలకుర్తి వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కర్నూలులో మెకానిక్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



మృతి చెందిన జగదీష్

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

సి.బెళగల్: ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. రోడ్లు అధ్వానంగా మారాయని, బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిర్మించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడుకు అర్జీలను ఇచ్చారు. సి.బెళగల్లో కస్తూర్బా నుంచి బస్టాండ్ మీదుగా మోడల్ స్కూల్ వరకు రోడ్డు అధ్వానంగా ఉందని, మరమ్మతులు చేయించాలని సీపీఎం నాయకులు అధికారులను కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు మోహన్, హమాలీ సంఘం నాయకులు మల్లికార్జున, చిన్న అక్బర్, రంగన్న, సుందరాజు, సంటెన్న, సాగర్, చిన్న ఏసన్న తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కల్లూరు: రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేయాలని సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు సుధాకరప్ప, నరసింహులు కోరారు. ఈ మేరకు బుధవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని ఆమె కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులు, సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, ఏసు కలసి వినతి పత్రమిచ్చారు. వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించి, సంక్షేమ పథకాలు అమలు చేస్తానని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక హామీ ఎక్కడా అమలుకావడం లేదన్నారు. జిల్లా కేంద్రానికి దూరంగా గుడికంబాలిలో ఇసుక రీచ్ ఉండడం వల్ల అక్కడి నుంచి నగరానికి ఇసుక రావాలంటే రవాణా చార్జీలతో కలిపి ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. కర్నూలుకు దగ్గరలో ఉన్న ఇసుక రీచ్‌లను ప్రారంభించాలన్నారు. జీఓ 17ను రద్దు చేసి కార్మికులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. అబ్దుల్ రహిమాన్, శ్రీనివాసులు, అజిముద్దీన్, శ్రీనివాసులు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కర్నూలు(అర్బన్): మహిళలు కష్టపడే తత్వాన్ని అలవరచుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఆయేషా ఖాతూన్ సూచించారు. మహిళల ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తే కుటుంబాలు బాగుపడతాయన్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన మహిళలు విద్య, చేతి వృత్తులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన మహిళలకు బుధవారం ఆమె సర్టిఫికెట్లను అందించారు. ఆమె మాట్లాడుతూ టైలరింగ్‌లో నైపుణ్యం సాధించడం ద్వారా సూక్ష్మ పరిశ్రమలు స్థాపించుకునేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ట్రైనింగ్ సెంటర్ కో–ఆర్డినేటర్ సయ్యద్ ఖుద్రతుల్లా ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

కర్నూలు (టౌన్): పతకాలు సాధించే దిశగా క్రీడాకారులను ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అన్నారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని చెస్, క్యారమ్స్, వెయిట్ లిఫ్టింగ్, యోగా, హై జంప్ క్రీడాంశాలను ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణితో కలిసి జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. క్రీడల నిర్వహణ, వసతులకు సంబంధించి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావును అడిగి తెలుసుకున్నారు. క్రీడాకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నిర్వహించే పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు.

నేడు ర్యాలీ

జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం కర్నూలు నగరంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం నుంచి ర్యాలీ చేపట్టి ఎస్‌టీబీసీ కళాశాల సర్కిల్ మీదుగా తిరిగి ఔట్‌డోర్ స్టేడియంకు చేరుకుంటుందని వివరించారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నట్లు వెల్లడించారు.



యోగా పోటీలను పరిశీలిస్తున్న జేసీ బి.నవ్య, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి

హెచ్ఐవీ నిర్మూలనపై అవగాహన

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణపై బుధవారం నందికొట్కూరు «హ్యాండ్స్» స్వచ్ఛంద సంస్థ సభ్యులు అవగాహన కల్పించారు. వ్యాధి సంక్రమించే తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం హరిప్రియ, ఉపాధ్యాయుడు గజేంద్రుడు, సంస్థ ప్రాజెక్టు మేనేజర్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించండి

సి.బెళగల్: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజా అవసరాలు, సమస్యలు పరిష్కారం అయ్యేలా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ రాముడు ఆధ్వర్యంలో వికసిత్ ఆంధ్ర, విజన్ 2047 కార్యక్రమాల ప్రణాళికలపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ మండల అధికారులు గ్రామాలల్లో తమ శాఖల పరిధిలో వందరోజులు, ఏడాది, ఐదు సంవత్సరాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పల్లెల్లో సమగ్రంగా పరిశీలించి నివేదికలను పొందుపరచాలన్నారు. ప్రణాళికలతో రాబోయే కాలంలో పనులలో 15 శాతం వృద్ధి సాధించేలా అధికారులు కృషి చేయాల్సి ఉంటుందన్నారు. ఆక్వా కల్చర్ క్లబ్‌ను మండలంలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు డీడీ శ్యామల తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఓ ఆదినారాయణ, ఏఓ మల్లేష్‌కుమార్, ఎంఈఓ జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఇరిగేషన్ ఏఈలు గోనేనాయక్, సుకుమార్, సూర్యప్రకాష్, ఉద్యానవనశాఖ అధికారి మదన్‌మోహన్, ఏపీఓ లక్ష్మన్న, పశువైద్యులు ప్రవీన్‌కుమార్, రీచర్డ్స్, సుంకన్న పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీడీ శ్యామల



చిన్నటేకూరులో రహదారి దుస్థితి

చినుకు పడితే చిత్తడే!

కల్లూరు: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామాలలో రోడ్డు చిత్తడి చిత్తడిగా మారాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామాల్లో రోడ్లపై నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. మండల పరిధిలోని చిన్నటేకూరు, లక్ష్మిపురం బస్టాప్ దగ్గర గుంత ఏర్పడి రోడ్లు బురదమయంగా మారాయి. దీంతో ప్రయాణికులు, ద్విచక్రవాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహన చోదకులు బురదలో పడిన సందర్భాలు లేకపోలేదు. గుంతలు పూడ్చించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



లక్ష్మిపురం బస్టాప్ దగ్గర బురదమయమైన రోడ్డు



సి.బెళగల్ ప్రధాన రోడ్డులో నాటువేసి నిరసన తెలుపుతున్న నాయకులు

సీపీఎం వినూత్న నిరసన

సి.బెళగల్: అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఎం నాయకులు వినూత్న నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా నాయకుడు మోహన్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ దగ్గరున్న ఎమ్మిగనూరు - గూడూరు ప్రధాన రోడ్డులో ఏర్పడిన నీటి గుంతలో వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. సీపీఎం నాయకులు నిరసనకు ప్రజా సంఘాల నాయకులు సైతం మద్దతు తెలిపారు. రోడ్లకు మరమ్మతులు చేయించకుంటే ఆందోళనలు ఉద్రతం చేస్తామని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు.